# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023





**పేదింటి కుర్రోడు.. ఆటల్లో ధీరుడు**

అతడు నిరుపేద కుటుంబంలో పుట్టాడు. యోగాలో అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించాడు. -IIలో



**షూట్ లేకుండా చీనీకాయల విక్రయాలు**

షూట్ లేకుండా చీనీకాయలు విక్రయించాలని పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప అన్నారు. -IIలో

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం 34.7/26.9

జిల్లాలో ఆదివారం 26.9 – 34.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. – కడప అగ్రికల్చర్

# ఉత్కంఠకు తెర

- టీడీపీ అధినేత చంద్రబాబుకు రిమాండ్
- తెలుగు తమ్ముళ్లను ఉసిగొల్పుతూ వాయిస్ మెసేజ్ పంపిన అచ్చెన్న
- అక్కడక్కడా రెచ్చిపోయినా సమన్వయంతో వ్యవహరించిన పోలీసు శాఖ
- కోర్టు నిర్ణయం వెలుడడడంతో మౌనం దాల్చిన శ్రేణులు

సాక్షి ప్రతినిధి, కడప: ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొనసాగిన ఉత్కంఠతకు తెర పడింది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును రిమాండ్‌కు ఆదేశిస్తూ కోర్టు తీర్పు వెలువడింది. చంద్రబాబుకు జైలా.. బెయిలా అనే డైలామాలో రోజంతా ప్రజానీకం టీవీలకు అతుక్కుపోయింది. ఓ వైపు న్యూఢిల్లీ నుంచి వచ్చిన లాయర్ల బృందం గురించి చర్చోపచర్చలు.. ఇంకోవైపు ఆందోళనలు ఉధృతంగా నిర్వహించాలని రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు టీడీపీ శ్రేణులను ఉసిగొల్పిన ఆడియో మరో వైపు చర్చనీయాంశాలుగా మారాయి. ఎక్కడ నలుగురు గుమికూడినా ఇదే వ్యవహారంపై చర్చించుకోవడం కన్పించింది.

- స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ.371 కోట్లు ప్రజా ధనాన్ని దోపిడీ చేసిన మొత్తం వ్యవహారానికి



కర్త, కర్మ, క్రియా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబేనని సీఐడీ విభాగం ఆధారాలను సమకూర్చి అత్యంత పకడ్బందీగా అరెస్టుకు ఉపక్రమించింది. పోలీసుల అరెస్టు నుంచి కోర్టు ద్వారా బయటపడాలనే లక్ష్యంతో చంద్రబాబు అండ్‌కో భారీ స్థాయిలో ప్రయత్నాలు చేశారు. అరెస్టు అయ్యాక రాజధాని చేరకమునుపే సుప్రీంకోర్టు లాయర్లు విజయవాడకు చేరుకునేలా పథక రచన చేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా చట్టం ముందు నిలవలేకపోయాయి. సుదీర్ఘ వాదనల తర్వాత చంద్రబాబు అరెస్టు సబబేనంటూ కోర్టు రిమాండ్ విధించింది.

**ఉద్రిక్తతలు సృష్టించాలని ఆదేశించినా....**

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు ఎక్కడికక్కడ ప్రత్యక్ష ఆందోళనలు, ఉద్రిక్తతలు సృష్టించాలని స్పష్టమైన ఆదేశాలందాయి. రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశాల మేరకు అక్కడక్కడగా తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. పోలీసు యంత్రాంగంపై నోరు పారేసుకోవడం కన్పించినా సమన్వయంతో శాంతి భద్రతలను పర్యవేక్షించారు. జిల్లా కేంద్రమైన కడపలో మినహా తక్కిన ప్రాంతాల్లో తెలుగు తమ్ముళ్లు ఆశించిన చొరవ చూపించలేదు. కొంతమంది ఫోకస్ కావాలనే ఉద్దేశ్యంతో రెచ్చగొట్టే ప్రకటనలు చేసినా అన్నింటిని మౌనంగా వీక్షకులు వీక్షిస్తూ వచ్చారు. సాయంత్రానికి చంద్రబాబుకు రిమాండ్ ఖరారు కావడంతో టీడీపీ శ్రేణులు తెరమరుగు కావడం విశేషం.

## బాబుపై అనర్హత వేటు పడడం ఖాయం: ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



చాపాడు: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబు తప్పనిసరిగా శిక్ష పడుతుందని.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేయకుండా అనర్హత వేటు పడుతుందని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. చాపాడులో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అధికారం అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడి నేరంచేస్తే ఎవరైనా తప్పించుకోలేరని.. విచారించిన ఏసీబీ న్యాయమూర్తి చంద్రబాబుకు రిమాండ్ విధించడ ప్రజాస్వామ్యంలో మంచి పరిణామమన్నారు. ఇప్పటి వరకు 12 కేసుల్లో స్టేలు తెచ్చుకుని చంద్రబాబు బయట తిరుగుతున్నారని, స్కిల్ స్కామ్‌లో బెయిల్ తెచ్చుకోవాలనే ఉద్దేశంతో ఢిల్లీ నుంచి కోట్లాది రూపాయలు వెచ్చించి సిద్దార్థ్ లూథ్రాను తెప్పించుకున్నారన్నారు. నాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడమేగాక, సీఎంగా పనిచేసి 14ఏళ్లు ప్రజలను మోసం చేశారన్నారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి కేసీఆర్ కాళ్లు పట్టుకుని ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌ను వదిలిపెట్టాడన్నారు. ప్రత్యేక హోదాను కేంద్రంలో తాకట్టు పెట్టి ప్రత్యేక ప్యాకేజీ తెచ్చుకున్నాడన్నారు. రూ.375 కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి ఇందులో రూ.118కోట్లు ముడుపుల రూపంలో తీసుకున్నారన్నారు. నాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి సీఎంగా 14 ఏళ్లు ప్రజలను మోసం చేశారన్నారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి కేసీఆర్ కాళ్లు పట్టుకుని ఉమ్మడి రాజధాని హైదరాబాదును వదిలిపెట్టాడన్నారు. పోలవరం ప్రాజెక్టు కేంద్రం నిర్మించి ఉంటే ఎప్పుడో పూర్తయ్యేదన్నారు. స్కిల్ స్కామ్ కేసులో లోకేష్‌తో పాటు, పలువురు అరెస్ట్ అవుతారన్నారు. స్కిల్ స్కామ్ మాత్రమే కాకుండా అమరావతిలో అసైన్డ్ భూములు, ఇన్నర్ రింగ్ రోడ్డు, ల్యాండ్ పూలింగ్ ఇలా అనేక విధాలుగా లక్ష కోట్ల రూపాయల వరకూ అక్రమాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చట్టానికి ఎవరూ అతీతులు కారు: ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి



బద్వేలు అర్బన్: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టుతో చట్టానికి ఎవరూ అతీతులు కారని నిరూపితమైందని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి అనఆన్నారు. సాక్షితో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఎన్నో స్కాంలు చేసి స్టేలు తెచ్చుకుని తిరుగుతూ తాను నిప్పునని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని లూటీచేసిన చంద్రబాబును అరెస్టు చేయడం సమంజసమేనన్నారు. దర్యాప్తు సంస్థలు తేల్చి అరెస్టు చేస్తే తన స్వార్థ ప్రయోజనాల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై రుద్దాలనుకోవడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు.

## పాపం పండింది..న్యాయం గెలిచింది!



తననెవ్వరూ ఏమీ చేయలేరని అహంకారంతో విర్రవీగుతున్న చంద్రబాబునాయుడి పాపం పండింది. 48 గంటలపాటు టీడీపీ శ్రేణులు కుయుక్తులు పన్నినా, రూ.కోట్లు ఖర్చు చేసినా చివరకు న్యాయమే గెలిచింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆధారాలతో సహా చంద్రబాబు అవినీతి బయటపడడంతో జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఈ సంఘటన అవినీతి పరులకు కనువిప్పు కలిగించేలా ఉంది. – జయశ్రీ, సర్పంచ్, వద్దిరాల, మైలవరం మండలం

## ఏపీ పోలీసుల తీరు ప్రశంసనీయం



చంద్రబాబునాయుడును నంద్యాలలో అరెస్టు చేసిన దగ్గర నుంచి జైలుకు తరలించే వరకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు చేసిన విధానాన్ని ప్రతి ఒక్కరూ అభినందించాల్సిందే. పోలీసులు ఏమాత్రం భయాందోళనకు గురికాకుండా, అల్లర్లకు తావివ్వకుండా తమ డ్యూటీని చిత్తశుద్ధితో నెరవేర్చారు. ఒక ఆర్థిక నేరగాన్ని అరెస్టు చేసి క్షేమంగా కోర్టు ఎదుట హాజరు పరచగలిగారు. సంయమనం పాటిస్తూ కర్తవ్యాన్ని నెరవేర్చారు. – వి.రామాంజనేయయాదవ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కన్వీనర్, జమ్మలమడుగు

## కోర్టు తీర్పుపై బంద్‌కు పిలుపా?



న్యాయ వ్యవస్థపై గౌరవం ఉన్న ఎవ్వరైనా కోర్టు తీర్పును శిరసావహిస్తారు. తీర్పు సంతృప్తి ఇవ్వకపోతే ఉన్నత న్యాయస్థానాలకెళ్లి తమ వాదనలు వినిపించుకోవచ్చు. అంతేగానీ తెలుగుదేశం పార్టీ మాదిరి కోర్టు తీర్పునకు నిరసనగా బంద్‌కు పిలుపివ్వడం ఇపుడే చూస్తున్నాం. – లీలావతి, రాష్ట్ర పట్టణ ఆర్థిక మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్

## టీడీపీ ప్రయత్నాలకు స్పందన కరవు



చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీ నాయకులు ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేశారు. వారి ప్రయత్నాలు ఫలించలేదు. అల్లర్లు చేయాలని ప్రయత్నించినా పోలీసులు సమన్వయంతో వ్యవహరించి అల్లర్లకు తావులేకుండా చేశారు. టీడీపీ యత్నాలకు స్పందన కరవైంది. – సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు

## సమన్వయంతో వ్యవహరించారు



అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు విచారణను హుందాగా ఎదుర్కోవాలి. ప్రజలు రెచ్చిపోయేలా ప్రవర్తించడం తగదు. చంద్రబాబులాంటి వ్యక్తులు చట్టాలను గౌరవించాలి, పోలీసులు సమన్వయంతో వ్యవహరించడం అభినందనీయం. – ఎం. మల్లయ్య జిల్లా అధ్యక్షులు రజక సంఘాల సమాఖ్య

## న్యాయం గెలిచింది: ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



వల్లూరు: ఇంత కాలానికి న్యాయం గెలిచిందని, 45 ఏళ్ల రాజకీయ జీవితంలో కోర్టు బోను ఎక్కని చంద్రబాబు.. ఇపుడు అడ్డంగా దొరికిపోయాడని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కడపలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తప్పు చేయడమే పనిగా పెట్టుకుని దొరక్కుండా తప్పించుకు తిరుగుతన్నవారిని నీతిమంతులు అంటారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు లాయర్‌తోపాటు, తన 15 మంది లాయర్లతో వాదించుకున్నా.. చంద్రబాబుకు రిమాండ్ తప్పలేదన్నారు. అచ్చెన్నాయుడు, చివరికి రాధాకృష్ణ, రామోజీ తప్పు చేయలేదని ఎక్కడా చెప్పలేదన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికినా కొందరు సమర్థించారన్నారు. బెయిల్ దరఖాస్తుల కోసం రూ.కోట్లు ఖర్చు చేసి ఢిల్లీ నుంచి లాయర్లను రప్పించడం ఏమిటని ప్రశ్నించారు.

## చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి: ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబుపై కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదివారం స్పందించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలలో వ్యక్తిగత దూషణలు చేయడం సమంజసం కాదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరించలేదన్నారు. ఢిల్లీ నుంచి కోట్ల రూపాయల ఫీజులు ఇచ్చి ప్రత్యేక విమానాల్లో లాయర్లు వచ్చారన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను పలు సందర్భాలలో వారు కించపరిచే విధంగా మాట్లాడి క్షోభకు గురిచేసినా, ఒంటరిగా పోరాడారన్నారు. రాజకీయ కోణంలో కాకుండా కాజేసిన ప్రజా ధనాన్ని ప్రభుత్వానికి అప్పజెప్పాలని శ్రీకాంత్‌రెడ్డి హితవు పలికారు.

## న్యూస్‌రీల్

### అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి నేడు మౌఖిక పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ప్రభుత్వ కళాశాలలో జంతు శాస్త్రం బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు నేరుగా మౌఖిక పరీక్షలకు హాజరు కావచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు వారి బయోడేటా, ఇతర ధ్రువ పత్రాలు తీసుకుని ఈ నెల 11న ఉదయం 11 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ 9849765838, జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రవిశేఖర్ 9441689606లను సంప్రదించాలని కోరారు.

### వృషభాచలేశ్వరుడికి వెండి కిరీటం



ఆలయ చైర్మన్‌కు వెండి కిరీటాన్ని అందజేస్తున్న పల్లా శ్రీరాములు, వెంకటరమణమ్మ దంపతులు

వేంపల్లె: స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన లక్ష్మీవృషభాచలేశ్వర స్వామికి అన్నమయ్య జిల్లా మట్టితొగటపల్లి గ్రామానికి చెందిన పల్లా శ్రీరాములు, వెంకట రమణమ్మ దంపతులు ఆదివారం వెండి కిరీటాన్ని విరాళంగా అందజేశారు. రూ.5 లక్షల విలువచేసే రాళ్లతో పొదిగిన వెండి కిరీటాన్ని ఆలయ చైర్మన్ కురాకుల వెంకటేశుకు అందజేశారు. ఆలయ అర్చకులు హరిప్రవీణ్ వారితో ప్రత్యేక పూజలు చేయించి దుశ్శాలువాతో సత్కరించారు. పల్లా హరిబాబు, ఆలయ అసిస్టెంట్లు దాసిరెడ్డి, లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### చదరంగం పోటీలకు విద్యార్థి ఎంపిక



మట్టం లాస్యశ్రీ



జ్యోతిస్పందన

కడప ఎడ్యుకేషన్: జాతీయ బాలికల అండర్–14 చదరగం పోటీలకు కడప గాంధీనగర్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మట్టం లాస్యశ్రీ ఎంపికయ్యారు. గుంతకల్‌లో నిర్వహించిన పోటీల్లో లాస్యశ్రీ నాలుగో స్థానంలో నిలిచి జాతీయ బాలికల అండర్–14 చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. కడపకు చెందిన క్రీడాకారిణి జ్యోతి స్పందన ఐదు పాయింట్లు సాధించి 14వ స్థానంలో నిలిచారు.

## రాజీమార్గమే రాజమార్గం

- అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్
- రూ. 21,90,74,509 బాధితులకు చెల్లింపు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్: రాజీమార్గమే రాజమార్గంగా భావిస్తూ కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రెండో రోజు న్యాయమూర్తులు పలు కేసులను పరిష్కరించారు. జడ్జి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటుచేశామన్నారు. కడపలో 6, ప్రొద్దుటూరు 4, రాయచోటి 3, బద్వేలు 2, రాజంపేట, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరులో ఒక్కొక్క బెంచీ ఏర్పాటుచేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 12,342 క్రిమినల్, 304 సివిల్, 593 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించామన్నారు. కడపలో 4270, ప్రొద్దుటూరు 1232, రాజంపేట 519, రాయచోటి 843, బద్వేలు 2365, జమ్మలమడుగు 1631, సిద్ధటం 219, రైల్వేకోడూరు 265, పులివెందుల 692, నందలూరు 563, లక్కిరెడ్డిపల్లె 262, కమలాపురంలో 378 కేసుల చొప్పున పరిష్కరించామన్నారు. బాధితులకు రూ.21,90,74,509 అందజేయడం జరిగిందన్నారు.

## కడపకు చేరుకున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



నూతన ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు స్వాగతం పలుకుతున్న పోలీసు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన సిద్దార్థ్ కౌశల్ ఆదివారం కడపకు చేరుకున్నారు. కడప విమానాశ్రయానికి వచ్చిన ఆయనకు ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ.కృష్ణారావు, కడప డీఎస్పీ ఎస్ఎండీ.షరీఫ్, డీఎస్పీ బాలస్వామిరెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు అశోక్‌రెడ్డి, వెంకట కుమార్, ఆర్‌ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్ తదితరులు పూల బొకేలతో స్వాగతం పలికారు. సోమవారం తన కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ కేకేఎన్. అన్బురాజన్ బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్లిన విషయం విదితమే.

## తాళ్లపాకలో అన్నమయ్య పద నృత్య వైభవం



హాజరైన వారితో అన్నమాచార్య వంశీయులు

నందలూరు (రాజంపేట): తాళ్లపాక వంశీయులు స్థాపించబడిన అన్నమయ్య సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలమైన తాళ్లపాకలో ఆదివారం వైభవంగా అన్నమయ్య పదనృత్య వైభవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నిత్య హారతి కైంకర్యాదార్ తాళ్లపాక శేషాదర్ రవి కుమార్ ఆచార్యులు మాట్లాడుతూ తాళ్లపాక అన్నమాచార్య జన్మస్థలమైన తాళ్లపాకలో అన్నమయ్య పదనృత్య వైభవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు నటరాజ కళాక్షేత్రానికి చెందిన మొహిద్దీన్ ఖాన్, కైకలూరు కూచిపూడి ప్రిన్సిపాల్ పసుమర్తి శ్రీవల్లి, హైదరాబాదు నటరాజ్ నృత్య సమితి కె.తరంగిణి, కడప నాట్య కళాభారతికి చెందిన కె.కామేశ్వరి, విశాఖపట్నంకు చెందిన తాళ్లపాక సందీప్ కుమార్, రైల్వేకోడూరుకి చెందిన వేంపల్లి హసీనా, రాజంపేట శివా డ్యాన్సు అకాడమీ, మూవీ కొరియోగ్రాఫర్ పెనగలపాటి శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

## జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా పలు మండలాల్లో ఆదివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. ఇందులో బద్వేల్‌లో 8 ఎంఎం వర్షం కురిసింది. అలాగే చాపాడులో 6.6, గోపవరంలో 6.4, పోరుమామిళ్లలో 6.2, మైదుకూరులో 6, కలసపాడు, ఖాజీపేటల్లో 4.2, బికోడూరులో కాశినాయనలో 4, బి.దువ్వూరులో 3.8, మఠంలో 2.8, రాజుపాలెంలో 2, 6, జమ్మలమడులో 2.4, అట్లూరులో 1.4, పొద్దుటూరు, ఎర్రగుంట్లలో 1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

## క్లుప్తంగా

### శుభకార్యం



వధూవరులతో డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, కడప మేయర్‌ కె.సురేష్‌బాబు

కడప కార్పొరేషన్‌ : తిరుమల, తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు ఆర్‌. వెంకట సుబ్బారెడ్డి(మాసీమ బాబు) కుమారుడు ఆర్‌.రాజగోపాల్‌రెడ్డి, లక్ష్మిసరైనాల నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. ఆదివారం ప్రొద్దుటూరులోని శ్రీదేవి కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి(మైదుకూరు), పి.రవీంద్రనాథ్‌రెడ్డి(కమలాపురం), గడికోట శ్రీకాంత్‌రెడ్డి(రాయచోటి), డాక్టర్‌ దాసరి సుధ(బద్వేల్‌), గంగుల నాని(ఆళ్లగడ్డ), కడప మేయర్‌ కె.సురేష్‌బాబు, జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌ యాదవ్‌, ఆర్టీసీ చైర్మన్‌ ఏ. మల్లికార్జునరెడ్డి, వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్‌, హాఫీజుల్లా, కార్పొరేటర్లు హాజరై వదూవరులను ఆశీర్వదించారు.

### అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగరం మార్కెట్‌ యార్డు సమీపంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. టూటౌన్‌ ఎస్‌ఐ జయరాములు కథనం మేరకు.. కడప నగరం ఆర్కే నగర్‌కు చెందిన షేక్‌ మహబూబ్‌బాషా (24) హమాలీగా పని చేసేవాడు. ఐదేళ్ల కిందట కడపకు చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. ఏడాది నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. రెండు, మూడు రోజుల నుంచి కడప మార్కెట్‌ యార్డు వద్దనే పడుకునే వాడు. ఆదివారం మృతి చెందడంతో మృతుని తండ్రి షేక్‌ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

### భార్య చేతిలో భర్త హతం

రాయచోటిటౌన్‌ : భార్య చేతిలో భర్త ఆంజనేయుల నాయుడు (35) హతమయ్యాడు. అర్బన్‌ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆంజనేయుల నాయుడు వీరబల్లి మండల కేంద్రంలో వీఆర్‌వోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన రాయచోటి పట్టణంలోని ప్రకాష్‌ నగర్‌ పాపిరెడ్డి కోళ్ల ఫారం సమీపంలో నివాసముంటున్నారు. అయితే ఆయన ఆదివారం తెల్లవారుజామున అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు వెళ్లి విచారణ చేయగా.. ఆయన భార్య నందిని తన భర్త ప్రమాదవశాత్తు బాత్‌ రూంలో పడి చనిపోయాడని చెప్పింది. అయితే అనుమానం రావడంతో లోతుగా విచారణ చేపట్టారు. రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఆమె ప్రియుడు చిన్నప్పరెడ్డితో కలసి దిండు ముఖంపై వేసి గట్టిగా అదిమేసి ఊపిరి ఆడనీకుండా చేయడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. నిందితులు ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. త్వరలో వారిని పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# పేదింటి కుర్రోడు.. ఆటల్లో ధీరుడు

**అతడు నిరుపేద కుటుంబంలో పుట్టాడు. కుటుంబ పోషణకు తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూస్తూ పెరిగాడు. ఉన్నత స్థాయికి చేరుకోవాలని లక్ష్యాన్ని పెట్టుకున్నాడు. అందుకు ఆటలను ఎంచుకున్నాడు. యోగాలో సాధన చేసి రాటుదేలాడు. పోటీల్లో సత్తా చాటాడు. అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించాడు. కన్నవారి కళ్లలో ఆనందం నింపాడు.**

- అంతర్జాతీయ యోగా పోటీల్లో ప్రతిభ
- బంగారు పతకం సాధించిన శివానాయక్‌



బ్యాంకాక్‌ ప్రతినిధుల నుంచి బంగారు పతకాన్ని అందుకుంటున్న శివానాయక్‌

కడప ఎడ్యుకేషన్‌ : కడప నగరంలోని ఆర్ట్స్‌ కళాశాలలో బీఏ మూడో సంవత్సరం చదువుతున్న శివానాయక్‌ అంతర్జాతీయ యోగా పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. ఆదివారం బ్యాంకాక్‌ (థాయిలాండ్‌)లో అంతర్జాతీయ యోగాలో 19–20 ఏళ్ల విభాగంలో నిర్వహించిన పోటీల్లో అతను పాల్గొని తమ ప్రతిభను చాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకుని కడప కీర్తిని చాటాడు. శివానాయక్‌ది గుంటూరు జిల్లా మాచవరం మండల పరిధిలోని పిన్నెల్లి తండా. వీరి తల్లిదండ్రులైన నాగరాజునాయక్‌, ఆదిలక్ష్మిబాయి దంపతులు నిరక్షరాస్యులతో పాటు దినసరి కూలీలు. వీరి కష్టాన్ని కళ్లారా చూసిన శివానాయక్‌ చిన్నతనం నుంచే శ్రద్ధతో చదువుతూ వచ్చాడు. 8వ తరగతి చదువుతున్నప్పటి నుంచే యోగాపై ఉన్న ఆసక్తితో దూరదర్శన్‌లో వస్తున్న యోగా పోటీలు చూసి ఆ దిశగా సాధన చేశాడు. దీంతో ఎన్నో యోగా పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటడంతోపాటు గిన్నీస్‌ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో కడప యోగివేమన యూనివర్సిటీ యోగా పోటీలలో రెండు సార్లు ప్రథమస్థానం సాధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. ఇప్పుడు యూనివర్సల్‌ యోగా స్పోర్ట్స్‌ ఫెడరేషన్‌ వారు బ్యాంకాక్‌(థాయిలాండ్‌)లో నిర్వహించిన ఏషియా పసఫిక్‌ యోగా ఫెడరేషన్‌ చాంపియన్‌షిప్‌ 2023 పోటీలకు అర్హత సాధించాడు. దీంతో ఈ పోటీలకు అతనికి విమాన ప్రయాణం చార్జీలు, అక్కడి ఖర్చులకు ఉడతా భక్తి సాయంగా కళాశాల అధ్యాపకులు 10 వేలు అందించి ఆల్‌ది బెస్ట్‌ చెప్పి పంపారు. ఈ అంతర్జాతీయ యోగా పోటీల్లో శివానాయక్‌ ప్రతిభను చాటి బంగారు పతకాన్ని సాధించాడు. ఇందుకు కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

# షూట్‌ లేకుండా చీనీకాయల విక్రయాలు



చీనీకాయల వేలం పాటను పర్యవేక్షిస్తున్న ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, యార్డు చైర్మన్‌ చిన్నప్ప

పులివెందుల రూరల్‌ : షూట్‌ లేకుండా చీనీకాయల విక్రయాలు మార్కెట్‌యార్డులో కొనసాగించాలని పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్‌ చిన్నప్ప అన్నారు. షూట్‌ లేకుండా చీనీకాయల క్రయ విక్రయాలకు మార్కెట్‌యార్డు శ్రీకారం చుట్టింది. ఆదివారం మార్కెట్‌యార్డులో చీనీకాయల కొనుగోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షూట్‌ లేకుండా వివిధ ప్రాంతాల నుంచి రైతులు తెచ్చిన చీనీకాయలను మార్కెట్‌యార్డు అధికారులు 30 టన్నులు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, చైర్మన్‌ చిన్నప్ప మాట్లాడుతూ చీనీకాయల కొనుగోలులో షూట్‌ నివారించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో, కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి సహకారంతో రెండేళ్ల క్రితమే మార్కెట్‌యార్డులో జంబోషెడ్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి రైతులు చీనీకాయలు తెచ్చి ఇక్కడ విక్రయాలు చేసుకోవచ్చన్నారు. ఇందులో గ్రేడింగ్‌ ఆధారంగా చీనీకాయలకు ధరలు చెల్లిస్తారన్నారు. మంచి నాణ్యత గల గ్రేడ్‌–1 చీనీ కాయలకు టన్ను రూ.30 వేలు, గ్రేడ్‌–2 కాయలు రూ.25 వేలతో వేలంపాట నిర్వహించారన్నారు. ఇందువల్ల ఇటు రైతులకు, వ్యాపారస్తులకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చీనీకాయల కొనుగోలు విషయంలో షూట్‌ లేకుండా కొనుగోలు చేసేందుకు తగు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జేడీలు రాజశేఖర్‌, రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, అడిషనల్‌ డైరెక్టర్‌ ఆజాద్‌, మార్కెట్‌యార్డు వైస్‌ చైర్మన్‌ సర్వోత్తమరెడ్డి, రాష్ట్ర హార్టికల్చర్‌ డైరెక్టర్‌ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధంతోనే హత్య

- ఆరుగురి నిందితుల అరెస్ట్‌
- డీఎస్పీ నాగరాజు



నిందితుల అరెస్ట్‌ చూపుతున్న డీఎస్పీ నాగరాజు

పులివెందుల : వివాహేతర సంబంధంతోనే నాగరాజు హత్య జరిగిందని జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు తెలిపారు. ఆదివారం పులివెందులలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో చింతకాయల నాగరాజు తన మోటారు సైకిల్‌లో ఇంటి వద్ద నుంచి టమాట తోట వద్దకు వెళ్లగా.. అక్కడ అతని కోసం కాపుకాచి ఉన్న వారు వేటకొడవళ్లు, గొడ్డలితో దాడి చేసి హతమార్చారని తెలిపారు. ఈ హత్యలో బొర్రా చెన్నకేశవులు, బొర్రా చందు, బొర్రా చెన్నకృష్ణ, బొర్రా చంద్రాయుడు, బొర్రా గంగన్న, బొర్రా గోపాల్‌లకు ప్రమేయం ఉందన్నారు. ఈ హత్యకు ముఖ్య కారణం గతంలోనే నాగరాజుకు వివాహమై భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారని, అయితే ఆయన 5 ఏళ్ల నుంచి బొర్రా చెన్నకేశవుల చెల్లెలితో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడన్నారు. 2018లో నాగరాజు పులివెందులలో నివాసం ఉన్న సమయంలో బొర్రా చెన్నకేశవులు, అతని తమ్ముడు బొర్రా చందులు నాగరాజు ఇంటి వద్దకు వెళ్లి తమ చెల్లెలి విషయం అడుగగా ఆయన వారిపై వేటకొడవలితో దాడిచేయడం జరిగిందన్నారు. అప్పట్లో నాగరాజుపై ఆ విషయానికి సంబంధించి పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఆ కేసుకు సంబంధించి ఈ ఏడాది ఆగస్టు 21వ తేదీన సాక్ష్యం చెప్పాలని హైదరాబాదులో ఉన్న తమ చెల్లెలిని అడుగగా, తాను నాగరాజును పెళ్లి చేసుకున్నానని, ప్రస్తుతం 8 నెలల గర్భవతినని నాగరాజుకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పేందుకు తిరస్కరించిందన్నారు. దీంతో కోపోద్రేక్తులైన బొర్రా చెన్నకేశవుల కుటుంబ సభ్యులు గ్రామంలో తమ పరువు పోయిందని, దీనికంతటికి కారణం నాగరాజుగా భావించి అతనిని చంపేందుకు నిర్ణయించుకున్నారన్నారు. అందులో భాగంగా ఈ నెల 8వ తేదీన టమాట తోట వద్దకు వచ్చిన నాగరాజును నరికి చంపారని తెలిపారు. కేవలం వివాహేతర సంబంధంతోనే ఈ హత్య జరిగిందని, దీనిలో ఎలాంటి రాజకీయాలకు సంబంధం లేదని ఆయన వివరించారు. మీడియా సమావేశంలో సీఐ మద్దిలేటి, లింగాల, తొండూరు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్‌ షాక్‌తో ఇద్దరు మృతి



అశోక్‌ కుమార్‌ (ఫైల్‌)

కమలాపురం : వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్‌ షాక్‌తో ఇద్దరు మృతి చెందారు. కమలాపురం మండలం టి.చదిపిరాళ్లలో ఒకరు, వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లెలో మరొకరు మృత్యువాత పడ్డారు. కమలాపురం మండలం టి.చదిపిరాళ్లలో జరుగుతున్న ఫైబర్‌ నెట్‌ తీగలాగే పనులు చేస్తున్న పసగడుగుల అశోక్‌ కుమార్‌ (24) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా కోటనందూరు మండలం పాత కొట్టం గ్రామానికి చెందిన అశోక్‌ కుమార్‌ గత కొంత కాలంగా కమలాపురంలోని కాంట్రాక్టర్‌ వద్ద ఉండి ఫైబర్‌ నెట్‌ వర్క్‌కు సంబంధించిన తీగ లాగే పనులు చేసేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మండలంలోని టి.చదిపిరాళ్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకొని తీగ లాగుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. విద్యుత్‌ స్తంభంపై నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఈ సమాచారం అందుకున్న ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

**పంటకు నీరు పెట్టేందుకు వెళ్లగా..**

వేంపల్లె : వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ముసల్‌రెడ్డి గారి గంగిరెడ్డి (55) ఆదివారం తెల్లవారుజామున విద్యుత్‌ షాక్‌తో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గంగిరెడ్డి తన ఐదు ఎకరాల పొలంలో వేరుశెనగ పంట వేశారు. తెల్లవారుజామున పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఆ క్రమంలో మోటార్‌కు అమర్చిన స్టార్టర్‌ పెట్టెకు విద్యుత్‌ వైర్లు షార్ట్‌ సర్క్యూట్‌ అయ్యాయి. దీంతో స్టార్టర్‌ పెట్టెకు విద్యుత్‌ రావడంతో ప్రమాదవశాత్తు గంగిరెడ్డికి విద్యుత్‌ షాక్‌ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం చుట్టుపక్కల పొలాలు ఉన్న రైతులు గమనించి బంధువులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న మృతుని బంధువులు విద్యుత్‌ షాక్‌ తగిలి చనిపోయినట్లు గమనించారు. మృతునికి భార్య సుబ్బలక్ష్మి, కుమారులు రామలింగారెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలు ఉన్నారు. ఇటీవల పెద్ద కుమార్తెకు వివాహం అయ్యింది. ఇంటి యజమానిని కోల్పోవడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన గంగిరెడ్డి

# శభాష్‌ పోలీస్‌



మహిళకు బ్యాగును అప్పగిస్తున్న ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు

బద్వేలు అర్బన్‌ : ఓ మహిళ ఆటోలో పోగొట్టుకున్న నగల బ్యాగును అర్బన్‌ పోలీసులు గంట వ్యవధిలోనే గుర్తించి అప్పగించి శభాష్‌ అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బెంగళూరు సిటీకి చెందిన తులసిరూప తన సమీప బంధువుల సీమంతం వేడుకలకు హాజరయ్యేందుకు శనివారం రాత్రి బెంగళూరులో బయలుదేరి ఆదివారం ఉదయం బద్వేలుకు చేరుకుంది. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఓ లాడ్జిలో బస చేసిన వీరు ఉదయం ఫంక్షన్‌కు వెళ్లేందుకు లాడ్జి వద్ద ఆటో ఎక్కారు. పోరుమామిళ్ల రోడ్డులోని ఓ ఫంక్షన్‌ హాలు వద్ద దిగిన వీరు హడావుడిలో నగలతో కూడిన బ్యాగును ఆటోలోనే మరిచిపోయింది. ఆటోడ్రైవర్‌ కూడా బ్యాగు ఉన్న సంగతి చూసుకోకుండా వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే బ్యాగు కనిపించకపోవడంతో ఆటోలోనే మరిచిపోయినట్లు గుర్తించి హుటాహుటిన అర్బన్‌ స్టేషన్‌కు చేరుకుని ఎస్‌ఐ కత్తివెంకటరమణకు విషయం తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన బ్లూకోల్ట్‌ విధుల్లో ఉన్న ఏఎస్‌ఐ సి.వెంకటేశ్వర్లు, హోంగార్డు లక్ష్మీనారాయణలను అప్రమత్తం చేశారు. వెంటనే వారు రంగంలోకి దిగి నాలుగు రోడ్ల కూడలి, ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఆటో డ్రైవర్లను విచారణ చేశారు. అప్పటికే అక్కడ ఉన్న ఆటోడ్రైవర్‌ తన ఆటోలో వెనుకభాగంలో ఉన్న బ్యాగును గుర్తించి పోలీసులకు అందజేశారు. వారు స్టేషన్‌కు వచ్చి ఎస్‌ఐ సమక్షంలో సదరు మహిళకు బ్యాగును అప్పగించారు. సుమారు రూ.4 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును కనుగొని అప్పగించిన పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

### పెన్నా నదిలో పడి..

చెన్నూరు : మండలంలోని కొక్కరాయపల్లి గ్రామానికి చెందిన గౌతకట్ల వెంకటయ్య (65) పెన్నానదిలో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసలురెడ్డి తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొక్కరాయపల్లి గ్రామానికి చెందిన గౌతు గట్ల వెంకటయ్య అనే వ్యక్తి గొర్రెల కాపరిగా ఉంటూ జీవనం సాగించేవాడు. ఈయన పుష్పగిరి వద్దగల గొర్రెల మంద వద్దకు శనివారం సాయంత్రం కొక్కరాయపల్లె నుంచి పుష్పగిరి వద్దకు పెన్నా నది మీదుగా వెళ్లారు. అయితే పెన్నా నది గుంతలలో పడిపోయి ఆదివారం ఉదయం చెన్నూరు బ్రిడ్జి వద్ద మృతదేహం లభించింది. కాగా మృతునికి భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి

# పిల్లలను తల్లిదండ్రులకు అప్పగింత



పిల్లలను తండ్రికి అప్పగిస్తున్న ఎస్సై రోషన్‌

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం బిదినంచెర్ల గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు కనిపించకుండా పోయారు. వారిని ఆదివారం తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు ఎస్సై రోషన్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బిదినంచెర్ల గ్రామానికి చెందిన రాజశేఖర్‌ రెడ్డి (పాముల రాజా) కుమారులైన రాజుల బిశ్వేశ్వర్‌రెడ్డి (14), కౌశిక్‌ కుమార్‌రెడ్డి(12) గురజాల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వారు ఈ నెల 5వ తేదీన పాఠశాలకు వచ్చి ఇంటికి వెళ్లలేదు. వారి తండ్రి చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికినా కనిపించకపోవడంతో 7వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రోషన్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని అన్ని పోలీస్‌ స్టేషన్లకు పిల్లల ఫొటోలను, వివరాలను పంపించారు. పిల్లలు గుంటూరులో ఉన్నట్లు 9వ తేదీన గుర్తించి అక్కడికి వెళ్లి వారిని తీసుకొచ్చి ఆదివారం తల్లిదండ్రులకు అప్పజెప్పారు. పిల్లల ఇష్టాలను గమనిస్తూ వారి నడవడికను గమనించి, సరైన మార్గంలో నడిచేటట్లు చూసుకోవాలని తల్లిదండ్రులకు ఎస్సై సూచించారు.

# తెలుగుకు వన్నె తెచ్చిన వెలుగులు ‘విశ్వనాథ, వడ్డాది’



‘విశ్వనాథ, వడ్డాది’ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్‌ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్‌ : మహాకవి విశ్వనాథ సత్యనారాయణ, అద్భుతమైన చిత్రకారుడు వడ్డాది పాపయ్యలు తెలుగు జాతికి వెలుగులు తెచ్చిన మహా వ్యక్తులని యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రంలో ‘కవిసమ్రాట్‌’ విశ్వనాథ సత్యనారాయణ 129వ జయంతిని, ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య 103వ జయంతిని నిర్వహించారు. తొలుత పరిశోధన కేంద్రం సిబ్బంది విశ్వనాథ సత్యనారాయణ, వడ్డాది పాపయ్య చిత్రపటాలకు పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానపీఠ పురస్కారం పొందిన తొలి తెలుగు కవి విశ్వనాథ సత్యనారాయణ, చిత్రకళా ప్రతిభతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన వడ్డాది పాపయ్య తెలుగు జాతికి గర్వకారణమన్నారు. సీపీ బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్‌ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణకు భారతీయ ఆర్ష సంస్కృతి పట్ల, తెలుగు నేల పట్ల మక్కువ ఎక్కువని, అందువల్ల ఆయన రచనల్లో అవి స్పష్టంగా ప్రతిఫలిస్తుంటాయన్నారు. లైబ్రరీ అసిస్టెంట్‌ ఎన్‌.రమేష్‌రావు కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రం జూనియర్‌ అసిస్టెంట్‌ ఆర్‌.వెంకట రమణ, సిబ్బంది పి.చంద్రకిశోర్‌, అరుణ తదితరులు పాల్గొన్నారు.

### మిషన్‌ ఇంద్రధనుస్సును విజయవంతం చేద్దాం

రాయచోటి అర్బన్‌ : శిశువులు, గర్భవతుల్లో వందశాతం వ్యాధి నిరోధకతను పెంచే సరికొత్త మిషన్‌ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేద్దామని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యఅధికారి డాక్టర్‌ కొండయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మిషన్‌ ఇంద్రధనుస్సుపై ఆరోగ్య సిబ్బందికి, వైద్యులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. 5 సంవత్సరాలలోపు ప్రతిబిడ్డకు, ప్రతి గర్భవతికి ఇప్పటి వరకు అందని అన్ని వ్యాధినిరోధక టీకాలను అందేటట్లు చేయడమే మిషన్‌ ఇంద్రధనుస్సు ప్రధాన ఉద్దేశమన్నారు.






# జోరుగా.. హుషారుగా..





రైతులు జోరుగా.. హుషారుగా వరి నాట్లు వేస్తున్నారు. ఆడుతూ పాడుతూ పని చేస్తుంటే అలుపు సొలుపేమున్నది.. అందరం ఒకటై చేయి కలిపితే మనకు ఎదురేమున్నది అంటూ ముందుకు సాగుతున్నారు. రైతులు బోర్ల కింద ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం వల్లూరు మండలం కొత్తపల్లె, ఉప్పరపల్లెలో వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

– ఫొటోగ్రాఫర్‌, సాక్షి, కడప





చెప్పండి మేడమ్..



జీ20 సదస్సు వద్ద బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో మోకాలిపై కూర్చుని మాట్లాడుతున్న బ్రిటన్ ప్రధాని రిషి సునాక్

సెల్ఫీ ప్లీజ్..!



ప్రధాని మోదీతో సెల్ఫీ తీసుకుంటున్న ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్, ఆయన పార్ట్‌నర్ జోడీ హేడెన్

ప్రెసిడెంట్‌తో ఫొటో..



వియత్నాం వెళ్లేముందు విమానాశ్రయంలో ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులతో అధ్యక్షుడు బైడెన్

చిటపట చినుకులు పడుతూ ఉంటే..



అక్షర్‌ధామ్ ఆలయం ఆవరణలో గొడుగు నీడలో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ దంపతులు

## బైడెన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న వేళ..!

న్యూఢిల్లీ: అత్యంత ప్రతిష్టాత్మకమైన జీ20 శిఖరాగ్ర సదస్సులో చీమ చిటుక్కుమన్నా భద్రతా బలగాలు రెప్పపాటులో స్పందించే పరిస్థితి ఉంటుంది. అలాంటిది ఒకతను విలాసవంతమైన కారును ఎంచక్కా నడుపుకుంటూ ఢిల్లీ తాజ్ హోటల్‌లోకి వచ్చేశాడు. గుర్తు తెలియని వాహనమొకటి హోటల్‌లోకి రావడం చూసిన అక్కడి భద్రతా బలగాలు ఉలిక్కిపడ్డాయి. వెంటనేగా అప్రమత్తమయ్యాయి. ఎందుకంటే అదే హోటల్‌లో అప్పటికే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్ బస చేస్తున్నారు. జీ20 సదస్సు కోసం విచ్చేసిన ఆయనకు ఈ హోటల్‌లోనే కేంద్ర ప్రభుత్వం బస ఏర్పాట్లుచేసింది. కారుతో దూసుకొచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఎవరబ్బా.. అని ఆరా తీస్తే అతను అమెరికా అధ్యక్షుడు బైడెన్ వాహనశ్రేణికి చెందిన డ్రైవర్‌గా తేలింది. మరి ఇటువైపు ఎందుకొచ్చావయ్యా ? అని పోలీసులు అతడిని ఆరా తీశారు. 'లోథీ ఎస్టేట్ ప్రాంతం నుంచి ఒక పారిశ్రామికవేత్తను ఈ హోటల్‌కు తీసుకురావాలని చెప్పారు. అందుకే ఇటు వైపు వచ్చా' అని తాపీగా బదులిచ్చాడు. వాస్తవానికి అతను ఎక్కడికి వెళ్లాలనేది ముందుగానే పక్కాగా షెడ్యూల్ అయింది. నిజానికి అతను బైడెన్ బస చేసిన ఐటీసీ మౌర్య హోటల్‌కు ఉదయం తొమ్మిదిన్నర గంటలకు వెళ్లాలి. కానీ అతనికి ప్రోటోకాల్ నిబంధన విభాగం వారు ఆదేశాల్లో గందరగోళం కారణంగా వాహనాన్ని తాజ్ హోటల్‌లోకి తీసుకొచ్చాడు. డ్రైవర్‌కు తప్పుడు ఆదేశాలు వచ్చాయని, తప్పేమీ లేదని నిర్ధారించుకున్నాక అతడిని వదిలేశారు. దాంతో అక్కడి వారంతా ఊపిరిపీల్చుకున్నారు.

### ఆర్ఆర్ఆర్ అద్భుతం: బ్రెజిల్ అధ్యక్షుడు

న్యూఢిల్లీ: గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా విడుదలై ఘన విజయం సాధించిన తెలుగు సినిమా 'ఆర్ఆర్ఆర్'పై బ్రెజిల్ అధ్యక్షుడు లూలా మనసు పారేసుకున్నారు. తనకెంతో నచ్చిన సినిమా అని మెచ్చుకున్నారు. జీ20 సదస్సు కోసం ఢిల్లీకి వచ్చిన లూయిజ్ ఒక ఆన్‌లైన్ పోర్టల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఆ ఇంటర్వ్యూలో ' మీకు నచ్చిన భారతీయ సినిమా పేరు చెప్పండి' అన్న ప్రశ్నకు ఆయన ఠక్కున ఆర్ఆర్ఆర్ అని చెప్పారు. 'ఇది చక్కని ఫీచర్ ఫిల్మ్. సరదా సన్నివేశాలు, అలరించే డ్యాన్స్‌లతో కట్టిపడేస్తుంది. బ్రిటిషర్లు భారతీయులను ఎంతగా అణచివేశారనేది కళ్లకు కట్టింది' అని అన్నారు.

# బిజీబిజీగా ద్వైపాక్షిక భేటీలు

## జీ20 సభ్యదేశాల అధినేతలతో ప్రధాని మోదీ వేర్వేరుగా చర్చలు



న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా విచ్చేసిన సభ్యదేశాల అధినేతలతో ప్రధాని మోదీ విడివిడిగా భేటీ అయ్యారు. ద్వైపాక్షిక చర్చల్లో బిజీగా కనిపించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, జర్మనీ చాన్స్‌లర్ ఓలాఫ్ స్కోల్జ్, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్, తుర్కియే అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్, నెదర్లాండ్స్ ప్రధాని మార్క్ రెటే, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా, యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండెర్ లెయిన్, నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ తినుబు, ఆఫ్రికా యూనియన్ అధ్యక్షుడు అజలీ అసోమనీ తదితరుల నాయకులతో మోదీ వేర్వేరుగా చర్చలు జరిపారు.

- 'మధ్యాహ్నం భోజనం వేళ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో జరిపిన విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చలు ఫలవంతమయ్యాయి. ఇండియా-ఫ్రాన్స్ బంధం నూతన సమున్నత శిఖరాలకు చేరేందుకు ఇరువురం కృషిచేస్తాం' అని మోదీ ట్వీట్‌చేశారు.
- జీ20 సారథ్య బాధ్యతలను విజయవంతంగా నిర్వహించినందుకు నేతలంతా మోదీని అభినందించారు. ఇంటర్‌గవర్నమెంటల్ కమిషన్ మరో దఫా చర్చల కోసం వచ్చే ఏడాది భారత్‌కు విచ్చేయాల్సిందిగా జర్మనీ చాన్స్‌లర్ ఓలాఫ్ స్కోల్జ్‌ను మోదీ ఆహ్వానించారు. ఫిబ్రవరిలో భారత్‌లో పర్యటించిన ఓలాఫ్‌కు ఇది రెండో అధికారిక పర్యటన. రక్షణ, హరిత, సుస్థిరాభివృద్ధి, అరుదైన ఖనిజాలు, నైపుణ్యమైన సిబ్బంది, విద్య తదితర రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై స్కోల్జ్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు.
- శుద్ధ ఇంధనం, సెమీ కండక్టర్లు, డిజిటల్ సాంకేతికత తదితరాలపై నెదర్లాండ్స్ ప్రధానితో మోదీ చర్చించారు.
- వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, చిరుధాన్యాలు, ఆర్థిక సాంకేతికతలపై నైజీరియా అధ్యక్షుడు తినుబుతో మోదీ చర్చలు జరిపారు.
- జీ20లో శాశ్వత సభ్యత్వానికి కృషిచేసినందుకు ఆఫ్రికా యూనియన్ అధ్యక్షుడు అజలీ మోదీకి కృతజ్ఞతలు చెప్పారు.
- వాణిజ్యం, సాంస్కృతిక, ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం, ఈవీ బ్యాటరీ సాంకేతికతల పరిపుష్టికి మరింతగా కృషిచేయాలని నిర్ణయించామని ద.కొరియా నేత ఇయోల్‌తో భేటీ తర్వాత ప్రధాని మోదీ వెల్లడించారు.
- డిసెంబర్ ఒకటో తేదీ నుంచి బ్రెజిల్ సారథ్యంలో జీ20 మరిన్ని విజయాలు సాధించాలని ఆ దేశ అధ్యక్షుడు డ సిల్వాతో మోదీ వ్యాఖ్యానించారు.
- వాణిజ్యం, సాంకేతికత, అనుసంధానం వంటి కీలకాంశాల్లో యూరప్‌తో భారత్ బంధం మరింత పటిష్టానికి సంబంధించి యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో, ఐరోపా మండలి అధ్యక్షుడు చార్లెస్ మైఖేల్‌తో మోదీ విడిగా చర్చలు కొనసాగించారు.

### భారత్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి: ఎర్డోగన్

దక్షిణాసియాలో భారత్ తమకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్ పేర్కొన్నారు. భారత్-తుర్కియే పరస్పర సహకారం అవిచ్ఛిన్నంగా కొనసాగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జీ20 సదస్సు ముగిశాక ఎర్డోగన్ మీడియాతో మాట్లాడారు. ఆదివారం భారత ప్రధాని మోదీతో సమావేశమయ్యాయని, ఇరు దేశాలకు సంబంధించిన ఉమ్మడి అంశాలపై చర్చించామని తెలిపారు. జీ20లో ఆఫ్రికన్ యూనియన్ భాగస్వామిగా మారడాన్ని ఎర్డోగాన్ స్వాగతించారు.



బ్రిటిష్ కౌన్సిల్‌లో దుస్తుల డిజైన్లను పరిశీలిస్తున్న బ్రిటన్ ప్రధాని సతీమణి అక్షతా మూర్తి

## భారత్ నేతృత్వంలో జీ20 శిఖరాగ్రం ఓ ముందడుగు

### రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్

న్యూఢిల్లీ: భారత్ సారథ్యంలో జరిగిన జీ20 శిఖరాగ్రం ఓ ముందడుగని రష్యా పేర్కొంది. జీ20 సదస్సు సాధించిన ఫలితాలు..సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగడానికి ప్రపంచానికి ఒక మార్గాన్ని చూపించాయి, గ్లోబల్ సౌత్ ప్రాముఖ్యాన్ని చాటాయని తెలిపింది. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్ సహా అనేక అంశాల్లో తమ వైఖరిని రుద్దేందుకు పశ్చిమదేశాలు చేసిన యత్నాలను అడ్డుకోవడంలో భారత్ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. ప్రపంచదేశాల్లో సైనిక సంక్షోభాలను ఐరాస చార్టర్‌ను అనుసరిస్తూ పరిష్కరించాలే తప్ప, వివిధ సంక్షోభాల పరిష్కారానికి పశ్చిమదేశాలు తమ సొంత వైఖరులతో ముందుకు సాగడానికి వీల్లేదన్న సందేశాన్ని ఈ శిఖరాగ్రం స్పష్టంగా పంపిందని లావ్రోవ్ చెప్పారు. 'ఈ శిఖరాగ్రం ఎన్నో విధాలుగా ఓ ముందడుగు వంటిది. అనేక సమస్యలపై ముందుకు సాగడానికి ఇది మార్గం చూపింది' అని అన్నారు. 'జీ20ని రాజకీయ వేదికగా మార్చేందుకు జరిగిన యత్నాలను అడ్డుకున్న భారత్‌కు ధన్యవాదాలు. అంతర్జాతీయ వేదికపై పశ్చిమ దేశాలు ఆధిపత్యం కొనసాగించలేదని చెప్పారు.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం 11-9-2023



### భారత ఫుట్‌బాల్ జట్టుకు నిరాశ

కింగ్స్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు చివరిదైన నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. థాయ్‌లాండ్‌లో నాలుగు దేశాల మధ్య జరిగిన ఈ టోర్నీలో భారత్‌కు వర్గీకరణ మ్యాచ్‌లోనూ ఓటమి ఎదురైంది. లెబనాన్ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సందేశ్ జింగాన్ నాయకత్వంలోని భారత జట్టు 0-1 గోల్ తేడాతో ఓడిపోయింది. లెబనాన్ తరఫున ఆట 77వ నిమిషంలో కాసీమ్ ఎల్ జీన్ గోల్ సాధించాడు. వ్యక్తిగత కారణాలతో రెగ్యులర్ కెప్టెన్ సునీల్ ఛెత్రి ఈ టోర్నీకి దూరంగా ఉన్నాడు.



### కిరణ్ జార్జికి సింగిల్స్ టైటిల్

భారత బ్యాడ్మింటన్ రైజింగ్ స్టార్ కిరణ్ జార్జి తన కెరీర్‌లో రెండో అంతర్జాతీయ టైటిల్‌ను సాధించాడు. జకార్తాలో ఆదివారం ముగిసిన ఇండోనేసియా ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-100 టోర్నీలో 23 ఏళ్ల కిరణ్ జార్జి విజేతగా నిలిచాడు. కేరళకు చెందిన కిరణ్ జార్జి ఫైనల్లో 21-19, 22-20తో జపాన్‌కు చెందిన ప్రపంచ 82వ ర్యాంకర్ కూ తకహాషిపై గెలుపొందాడు. కిరణ్ జార్జికు 7,500 డాలర్ల (రూ. 6 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



# వాన వచ్చింది... ఆట ఆగింది

- భారత్, పాక్ మ్యాచ్ నేటికి వాయిదా
- టీమిండియా 24.1 ఓవర్లలో 147/2
- ఇదే స్కోరు నుంచి కొనసాగనున్న భారత ఇన్నింగ్స్
- రోహిత్ శర్మ, గిల్ అర్ధ సెంచరీలు
- నేడూ వర్ష సూచన





కొలంబో: వేదిక మారినా... భారత్, పాకిస్తాన్ క్రికెట్ జట్లను మాత్రం వర్షం వెంటాడుతోంది. ఆసియా కప్ టోర్నీలో భాగంగా ఈ రెండు జట్ల మధ్య గ్రూప్ దశ మ్యాచ్ వర్షార్పణం కాగా... ఆదివారం జరగాల్సిన 'సూపర్-4' దశ మ్యాచ్‌కూ వాన అంతరాయం కలిగించింది. వాతావరణ పరిస్థితిని ముందే ఊహించిన నిర్వాహకులు ఈ మ్యాచ్‌కు మాత్రమే 'రిజర్వ్ డే' కేటాయించగా... వారి అంచనా నిజం అయింది. ఫలితంగా భారత్, పాక్ 'సూపర్-4' మ్యాచ్ నేటికి వాయిదా పడింది. వర్షం వల్ల ఆట నిలిచిపోయే సమయానికి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 24.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 147 పరుగులు సాధించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (49 బంతుల్లో 56; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (52 బంతుల్లో 58; 10 ఫోర్లు) ధాటిగా ఆడి అర్ధ సెంచరీలు చేశారు. తొలి వికెట్‌కు వీరిద్దరు 100 బంతుల్లో 121 పరుగులు జోడించారు. వర్షంతో ఆట నిలిచే సమయానికి విరాట్ కోహ్లి (16 బంతుల్లో 8 బ్యాటింగ్), కేఎల్ రాహుల్ (28 బంతుల్లో 17 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. మూడో వికెట్‌కు వీరిద్దరు అజేయంగా 24 పరుగులు జత చేశారు. సాయంత్రం గం. 4:50కు వర్షం మొదలై 5:30కు ఆగిపోయింది. సిబ్బంది పని మొదలుపెట్టగా అరగంట తర్వాత 6 గంటలకు వర్షం మళ్లీ వచ్చింది. పది నిమిషాల తర్వాత నిలిచిపోయింది. కవర్లు తీసేసిన సిబ్బంది మళ్లీ తమ పని మొదలుపెట్టారు. ఈ క్రమంలో అంపైర్లు రెండుసార్లు మైదానాన్ని పరిశీలించారు. మ్యాచ్‌ను 34 ఓవర్లకు కుదించి రాత్రి 9 గంటలకు ఆట తిరిగి ప్రారంభించాలని అంపైర్లు ఆలోచిస్తున్న సమయంలో రాత్రి 8:30కు వర్షం మళ్లీ వచ్చింది. దాంతో అంపైర్లు మ్యాచ్‌ను నేటికి వాయిదా వేశారు. నేటి మధ్యాహ్నం 3 గంటల నుంచి భారత ఇన్నింగ్స్ 24.1 ఓవర్ల నుంచి మొదలవుతుంది. అయితే సోమవారం కూడా కొలంబోలో భారీ వర్షం పడే అవకాశముందని వాతావరణ శాఖ సమాచారమిచ్చింది.

**స్కోరు వివరాలు**

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (సి) ఫహీమ్ అష్రఫ్ (బి) షాదాబ్ ఖాన్ 56; శుబ్‌మన్ గిల్ (సి) ఆగా సల్మాన్ (బి) షాహీన్ అఫ్రిది 58; కోహ్లి (బ్యాటింగ్) 8; కేఎల్ రాహుల్ (బ్యాటింగ్) 17; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం** (24.1 ఓవర్లలో 2 వికెట్లకు)147. **వికెట్ల పతనం:** 1-121, 2-123. **బౌలింగ్:** షాహీన్ 5-0-37-1, నసీమ్ 5-1-23-0, అష్రఫ్ 3-0-15-0, రవూఫ్ 5-0-27-0, షాదాబ్ 6.1-1-45-1.

# 'క్వీన్' కోకో...



### యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ నెగ్గిన అమెరికా టీనేజర్ కోకో గాఫ్

ఫైనల్లో సబలెంకాపై విజయం ● కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కైవసం
● రూ. 24 కోట్ల 90 లక్షల ప్రైజ్‌మనీ సొంతం





న్యూయార్క్: అందరి అంచనాలను తారుమారు చేస్తూ అమెరికా టీనేజర్ కోకో గాఫ్ యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్ చాంపియన్‌గా అవతరించింది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఫైనల్లో ఆరో సీడ్ కోకో గాఫ్ 2-6, 6-3, 6-2తో రెండో సీడ్, ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సబలెంకా (బెలారస్)పై విజయం సాధించింది. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరి రన్నరప్‌తో సరిపెట్టుకున్న 19 ఏళ్ల కోకో గాఫ్ సొంతగడ్డ తన గ్రాండ్‌స్లామ్ కలను నెరవేర్చుకుంది. 2 గంటల 6 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కోకో తొలి సెట్‌ను కోల్పోయినా ఆందోళన చెందలేదు. 23 వేల మంది ప్రేక్షకులతో 'హౌస్‌ఫుల్' అయిన స్టేడియంలో కోకో తన అనవసర తప్పిదాలను తగ్గించుకుంది. ర్యాలీలకు సూపర్ ఫినిష్ ఇస్తూ పాయింట్లు గెలిచి సబలెంకాపై ఒత్తిడి పెంచింది. నాలుగో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి తన సర్వీస్‌ను నిలబెట్టుకొని కోకో గాఫ్ 4-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో రెండో సెట్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లోనూ కోకో తన దూకుడు కొనసాగించింది. తొలి గేమ్‌లో, మూడో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌లను బ్రేక్ చేసి తన సర్వీస్‌లను కాపాడుకున్న కోకో 4-0తో ఆధిక్యంలోకి వచ్చింది. అయితే ఐదో గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని ఆరో గేమ్‌లో కోకో సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకా ఈ ఆధిక్యాన్ని 4-2కి తగ్గించింది. అయితే ఏడో గేమ్‌లో సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి 5-2తో ముందంజ వేసిన కోకో ఎనిమిదో గేమ్‌లో అద్భుతమైన బ్యాక్‌హ్యాండ్ విన్నర్ షాట్‌తో విజయాన్ని ఖాయం చేసుకుంది. విజేత కోకో గాఫ్‌కు 30 లక్షల డాలర్లు (రూ. 24 కోట్ల 90 లక్షలు), రన్నరప్ సబలెంకాకు 15 లక్షల డాలర్లు (రూ. 12 కోట్ల 45 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

**ఫైనల్ గణాంకాలు**

| కోకో గాఫ్ | | సబలెంకా |
|---|---|---|
| 2 | ఏస్‌లు | 4 |
| 5 | డబుల్ ఫాల్ట్‌లు | 6 |
| 7/10 | నెట్ పాయింట్లు | 13/21 |
| 5/9 | బ్రేక్ పాయింట్లు | 4/10 |
| 13 | విన్నర్స్ | 25 |
| 19 | అనవసర తప్పిదాలు | 46 |
| 83 | మొత్తం పాయింట్లు | 74 |

**4** క్రిస్ ఎవర్ట్ (1975లో), ట్రేసీ ఆస్టిన్ (1979లో), సెరెనా విలియమ్స్ (1999లో) తర్వాత యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన నాలుగో అమెరికన్ టీనేజర్‌గా కోకో గాఫ్ గుర్తింపు పొందింది.

**3** యూఎస్ ఓపెన్ టైటిల్‌తో కోకో గాఫ్ సోమవారం సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌కు చేరుకోనుంది. సహచరురాలు జెస్సికా పెగూలాతో కలిసి డబుల్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌నూ అందుకుంటుంది. డబుల్స్ విభాగంలో కోకో గాఫ్-జెస్సికా జోడీ క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది.

**4** ఈ ఏడాది కోకో గాఫ్ నెగ్గిన సింగిల్స్ టైటిల్స్. ఆక్లాండ్ ఓపెన్, వాషింగ్టన్ ఓపెన్, సిన్సినాటి ఓపెన్, యూఎస్ ఓపెన్‌లో ఆమె విజేతగా నిలిచింది.

**9** ఓపెన్ శకంలో (1968 నుంచి) యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ సాధించిన తొమ్మిదో అమెరికా ప్లేయర్‌గా కోకో గాఫ్ గుర్తింపు పొందింది. 2017లో స్లోన్ స్టీఫెన్స్ తర్వాత యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన అమెరికా ప్లేయర్ కోకో గాఫ్ నిలిచింది.

" ఈ విజయం నాకెంతో ప్రత్యేకం. గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచే సత్తా నాలో లేదని చాలా మంది వ్యాఖ్యానించారు. ఈ గెలుపుతో అమితానందంతోపాటు కాస్త ఉపశమనం కలిగింది. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఓడిపోయాక చాలా బాధ పడ్డాను. కానీ దేవుడు మనందరికి పరీక్ష పెడతాడని భావించి ముందుకెళ్లాను. ఈరోజు విజయం నా జీవితంలో మధురస్మృతిగా మిగిలిపోతుంది.
-కోకో గాఫ్

## రజతం నెగ్గిన నిత్య



చండీగఢ్: ఇండియన్ గ్రాండ్‌ప్రి ఐదో మీట్‌లో తెలంగాణ అథ్లెట్ జి. నిత్య మహిళల 100 మీటర్ల విభాగంలో రజత పతకం సాధించింది. ఆదివారం జరిగిన ఈ మీట్‌లో నిత్య 100 మీటర్ల దూరాన్ని 11.85 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది. స్రాబణి నందా (ఒడిశా; 11.77 సెకన్లు) స్వర్ణం, దానేశ్వరి (కర్ణాటక; 11.94 సెకన్లు) కాంస్యం సాధించారు.

## ప్రథమేశ్ 'రజత' గురి



హెర్మోసిల్లో (మెక్సికో): ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్స్ టోర్నీలో భారత ప్లేయర్ ప్రథమేశ్ జాకర్ రజత పతకంతో మెరిశాడు. ఆదివారం జరిగిన కాంపౌండ్ ఈవెంట్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో ప్రథమేశ్, మథియాస్ ఫులెర్టన్ (డెన్మార్క్) నిర్ణీత 15 బాణాల తర్వాత 148-148 పాయింట్లతో సమంగా నిలిచారు. 'షూట్ ఆఫ్'లో ఇద్దరు 10 పాయింట్ల షాట్ కొట్టారు. అయితే మథియాస్ కొట్టిన బాణం కేంద్ర బిందువుకు అతి సమీపంలో ఉండటంతో అతనికి స్వర్ణ పతకం దక్కింది. ప్రథమేశ్‌కు 15 వేల స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 13 లక్షల 94 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. భారత్‌కే చెందిన అభిషేక్ వర్మ ఒక పాయింట్ తేడాతో కాంస్య పతకాన్ని చేజార్చుకున్నాడు. మహిళల వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ, అదితి క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగారు.

## 'టాప్' ర్యాంక్‌లోకి ఆస్ట్రేలియా

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా జట్టు మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. ఇప్పటి వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న పాకిస్తాన్ జట్టు రెండో ర్యాంక్‌కు పడిపోయింది. బ్లోమ్‌ఫొంటేన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా 123 పరుగుల తేడాతో గెలవడంతో ఈ ర్యాంకింగ్స్‌లో మార్పు చోటు చేసుకుంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఖాతాలో 121 రేటింగ్ పాయింట్లు.. పాక్ ఖాతాలో 120 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. 114 రేటింగ్ పాయింట్లతో భారత్ మూడో స్థానంలో ఉంది.